

విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ: ఎస్ఈ

విజయనగరం రింగురోడ్డు: 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమలు చేయనున్న విద్యుత్ చార్జీలపై విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఈ నెల 29 నుంచి వర్చువల్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దాసన్నపేట విద్యుత్ భవనంలోని కార్యాలయం, బొబ్బిలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయం, పార్వతీపురం ఇంజనీరింగ్ కార్యాలయంలో ఫిబ్రవరి 1 వరకూ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 10.30 నుంచి 1 గంట వరకూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకూ నిర్వహిస్తామన్నారు.

జెండా పండగకు సర్వం సిద్ధం



విద్యుత్ వెలుగుల్లో కలెక్టర్ కార్యాలయం

పార్వతీపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి)

గణతంత్ర దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం జరిగే వేడుకలకు జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం ముస్తాబైంది. కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వ్యవసాయ శాఖ, ఉపాధి హామీ పథకం, విద్యాశాఖ, డీఆర్‌డీఏ, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. వీటిని జాయింట్ కలెక్టర్ గోవిందరావు గురువారం పరిశీలించారు. జాతీయ జెండాను కలెక్టర్

● నేడు ప్రభుత్వ కళాశాల మైదానంలో రిపబ్లిక్ డే వేడుకలు

ఎగురవేయనున్నారు. అనంతరం జిల్లా ప్రగతిని వివరించనున్నారు. అనంతరం ఉత్తమ అధికారులకు ప్రశంసాపత్రాలు అందించనున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీస్ వందన స్వీక రణకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఐటీడీఏలో పీవో విష్ణుచరణ్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.



జూనియర్ కళాశాల మైదానంలో పూర్తయిన ఏర్పాట్లు



పీటీ మండలో సెల్ టవర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఏజెన్సీలో నవ శకానికి నాంది

● సెల్ టవర్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్

జియ్యమ్మవలస, జనవరి 25: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో సెల్ టవర్ల ఏర్పాటు నవ శకానికి నాంది అని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని పీటీ మండలో ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 4జీ సేవలు పూర్తిగా అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన 60 టవర్లకు అటవీ అనుమతులు మంజూరు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 196 టవర్లను ఏర్పాటు చేస్తామన్నారు. దీనికోసం రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సెల్ టవర్ల ఏర్పాటుతో జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగు తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ పి.కిరణ్‌కుమార్, మండల స్థాయి అధికారులు, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.



టీడీపీ కౌన్సిల్ సభ్యులు లేకుండానే జరుగుతున్న సాధారణ సమావేశం

అర గంటలో ముగించేశారు

● మారని మునిసిపల్ సాధారణ సమావేశం తీరు

● టీడీపీ కౌన్సిల్ సభ్యులు లేకుండానే..

పార్వతీపురం టౌన్, జనవరి 25: మునిసిపల్ సాధారణ సమావేశం తీరు మారలేదు. ప్రతినెలా మాదిరిగానే ఈసారి కూడా అరగంటలోనే ముగించేశారు. బుధవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరగాల్సిన సాధారణ సమావేశం 20 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభం అయింది. చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ అధ్యక్షతన ప్రారంభమైన ఈ సమావేశాన్ని ప్రతిపక్ష టీడీపీ కౌన్సిల్ సభ్యులు లేకుండానే అరగంటలో ముగించేశారు. 13వ వార్డులోని కర్షక మహర్షి ఆసుపత్రి రోడ్డు వీధిలోని వరహాల గెడ్డపై కల్వర్టు శిథిలావస్థకు చేరకుందని, నూతన కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు రూ.17 లక్షలతో ప్రతిపాదన చేశారు. దీనిపై చైర్‌పర్సన్ అభ్యంతరం తెలిపారు. కల్వర్టు పనులపై ఇంజనీరింగ్ అధికారులు ఉత్సాహం చూపనవసరం లేదని, సంబంధిత అంశాన్ని వాయిదా వేయాలని కమిషనర్ రామఅప్పలనాయుడును కోరారు. ఇక నుంచి ప్రతిపక్ష టీడీపీ కౌన్సిల్ సభ్యుల వార్డుల్లో చేపట్టే పనులకు తన అనుమతులు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు పరోక్షంగా చైర్‌పర్సన్ హెచ్చరించారు. సాధారణ సమావేశాల్లో అధికారపక్ష కౌన్సిల్ సభ్యులు దురుసు ప్రవర్తనతో పాటు దాడులు దిగుతుండడంతో ప్రతిపక్ష టీడీపీ సభ్యులు సమావేశానికి హాజరుకాలేదని తెలుస్తోంది.



ఉల్లిభద్ర కుడి ప్రధాన కాలువపై నిర్మించిన దోనె పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న దృశ్యం

దోనె ఇలా.. నీరు పారేదెలా?

ఇది జంఝావతి ప్రాజెక్టుకు సంబంధించిన దోనె. ఏడాదిగా ఇలా పిచ్చిమొక్కలతోనే దర్శనమిస్తోంది. దీని మీదుగా పంట భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. జంఝావతి నుంచి మండలానికి సాగునీరు సరఫరా చేసేందుకు గత టీడీపీ హయాంలో ఉల్లిభద్ర సమీపంలోని తోటపల్లి కుడి ప్రధాన కాలువపై దోనెను నిర్మించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని నిర్వహణను గాలికొదిలేసింది. నాలుగేళ్లగా నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో దోనె పిచ్చిమొక్కలతో నిండింది. మండలానికి సుమారు 6 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా కావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

-గరుగుబిల్లి

మురుగునీరు చెత్తకుప్పలు..

● జిల్లా కేంద్రంలో అధ్వానంగా పారిశుధ్యం
● విపరీతంగా పెరిగిపోయిన దోమలు
● ఎక్కడా కానరాని నివారణ చర్యలు
● రోగాల బారిన ప్రజలు



నివాసాల మధ్య నిలిచిన మురుగునీరు

పార్వతీపురం టౌన్, జనవరి 21

జిల్లా కేంద్రం పార్వతీపురంలో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. సాయంత్రమైతే చాలు ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. దీంతో ప్రజలు డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా జ్వరాల బారినపడుతున్నారు. దోమల నివారణకు మునిసిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దోమలను కాదు కదా కనీసం వాటి గుడ్లను నాశనం చేయలేకపోతున్నారని నగర వాసులు వాపోతున్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఖర్చులు చూపిస్తున్నారే తప్ప పారి శుధ్య నిర్వహణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని, ఫలితంగా దోమలు విజృంభిస్తున్నాయని ప్రజా సంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

పారిశుధ్యం అధ్వానం..

పార్వతీపురం పట్టణం రెండేళ్ల క్రితం జిల్లా కేంద్రంగా రూపాంతరం చెందింది. దీంతో 30 వార్డులతో పాటు జిల్లా కేంద్రం శివారులో కాలనీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అయితే, పారిశుధ్యం నిర్వహణకు పక్కా ప్రణాళికలు లేకపోవడం ప్రజల పాలిట శాపంగా మారింది. 30 వార్డుల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న ఇందిరాకాలనీ, పాతరెల్లివీధి, నిర్మలాకాలనీల్లో పారిశుధ్యం క్షీణించింది. మురుగు నీరు నివాసాల మధ్యే నిలిచిపోవడం వల్ల దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమలతో స్థానికులు మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. మరోపక్క బొబ్బిలి, సాలూరు మునిసిపాలిటీల కంటే పార్వతీపురం మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికుల సంఖ్య తక్కువగా ఉంది. ఎప్పుడో 30 ఏళ్ల క్రితం 100 మంది శాశ్వత పారిశుధ్య కార్మికులను నియమించారు. ప్రస్తుతం వారి సంఖ్య 39కు చేరుకుంది. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిపై మరో 80 మందిని తీసుకోగా వారి సంఖ్య రోజు రోజుకు తగ్గుతూ వస్తుంది. జిల్లా కేంద్రంలో పారిశుధ్య నిర్వహణకు కార్మికులు తక్కువగా ఉన్నారంటే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజారోగ్యంపై ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతుంది. గతంలో పరిసరాల పరిశుభ్రతకు సంబంధించి మహిళా సంఘాలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పారిశుధ్యంపై అవగాహన కల్పించేవారు కరువయ్యారు.



పార్వతీపురం ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్త



పార్వతీపురం ఆస్పత్రిలో మలేరియా తదితర వ్యాధులతో చికిత్స పొందుతున్న ప్రజలు

దోమల నివారణకు చేయాల్సినవి..

మునిసిపాలిటీ, పంచాయతీల్లో వారానికోసారి డ్రైనేజీలు శుభ్రం చేయించాలి. దోమల నివారణకు మందు పిచికారీ చేపట్టాలి. ఫాగింగ్ చర్యలు కొనసాగించాలి. బహిరంగ ప్రదేశాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి. నీరు నిల్వ ఉంటే ఆయిల్ బాల్స్ గంబూషియా చేపలు వదలాలి. యాంటీ లార్వా కార్యక్రమాలు అమలు చేయాలి. బ్లీచింగ్ చల్లాలి. కానీ, పార్వతీపురంలో ఈ కార్యక్రమాలు నిరంతరం చేపట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి. జ్వర కేసులు నమోదైతే పరిసర ప్రాంతాల్లో వైద్య సిబ్బంది హడావుడిగా సర్వే నిర్వహిస్తు న్నారు. రక్తపూతలు సేకరించి వ్యాధి నిర్ధారిస్తున్నారు. నివాసాల్లో దోమ లార్వా వృద్ధి చెందకుండా చర్యలు చేపడుతు న్నారు. ఆ తరువాత పట్టించుకోక పోవడంతో దోమలు ఎప్పటిలాగే పెరిగిపోతున్నాయి.

ప్రచారానికే పరిమితం..

గత తెలుగుదేశం ప్రభుత్వం పారిశుధ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేది. ఇందులో భాగంగా దోమల నివారణ కోసం దోమలపై దండయాత్ర కార్యక్రమం నిర్వహించింది. దీనివల్ల గ్రామాల్లో దోమల బెడద బాగా తగ్గేది. అయితే, వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పారిశుధ్యం నిర్వహణను గాలి కొదిలేసింది. కేవలం ప్రచారానికే పరిమితమైందనే విమర్శలు ఉన్నాయి. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టడం లేదు. జీరో గ్యార్బేజి మేనేజ్‌మెంట్‌ను ప్రజారోగ్యశాఖాధికారులు కాగితాలకే పరిమితం చేశారు. క్లాప్ కార్యక్రమం కూడా ప్రచారానికే తప్పా సక్రమంగా అమలు కావడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పారిశుధ నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని పార్వతీపురం పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారు..

గత కొన్నేళ్లుగా పార్వతీపురం పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. పాలకులు, అధికారులు ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారు. పారిశుధ్య నిర్వహణకు ప్రతి ఏడాది లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ, ఎటు చూసినా చెత్తాచెదారం, మురుగు నీటి నిల్వలే కనిపిస్తున్నాయి. పారిశుధ్య కార్మికుల సంఖ్య తక్కువగా ఉండడం కూడా ప్రజల పాలిట శాపంగా మారింది.

-పాకల సన్యాసిరావు, పట్టణ పౌరసంక్షేమ సంఘం కార్యదర్శి

నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం..

దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. సాయంత్రమైతే ఇళ్లలోకి వచ్చేసి స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రజల ఆరోగ్యంపై కనీసం దృష్టి లేకపోవడం బాధాకరం. ఇప్పటికైనా దోమల నివారణకు చర్యలు చేపట్టాలి.

-ఎంవీ రమణ, పార్వతీపురం

ప్రత్యేక దృష్టి సారిస్తాం..

మునిసిపాలిటీలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక దృష్టి సారిస్తాం. జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి పారిశుధ్య నిర్వహణకు అదనంగా కార్మికులను నియమించాం. అంతే కాకుండా క్లాప్ కార్యక్రమం ద్వారా పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

-మురళీ, ప్రజారోగ్యవిభాగం ఇన్‌స్పెక్టర్, పార్వతీపురం

బాధితులకు న్యాయం చేయాలి

● ఎస్పీ విక్రాంత్ పాటిల్

బెలగాం, జనవరి 25: ప్రాధాన్యత గల కేసులను త్వరతగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలపై జరిగే నేరాలు, చోరీ కేసులపై దర్యాప్తు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రాధాన్యత గల కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులకు శిక్ష పడేలా చేసి బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవా లన్నారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాన్నారు. హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహనచోదకులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. బీట్ పాయింట్ పెంచి బీట్ అధికారి తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అక్రమ మద్యం అరికట్టేలా చర్యలు చేపట్టాలని, 174 సీఆర్‌పీసీ కేసుల్లో త్వరతగతిన దర్యాప్తు జరపాలని తెలిపారు. సైబర్



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

నేరాలపై దృష్టి సారించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, 1930 టోల్ ఫ్రీ నెంబర్‌ను బాగా ప్రచారం చేయాలని సూచించారు. త్వరలో జరగబోయే ఎన్నికలకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్య క్రమంలో అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్, ఏఎస్పీ సునీల్ షరోన్, దిశ డీఎస్పీ హర్షిత తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మహిళా పోలీసుపై భర్త దాడి

పాలకొండ, జనవరి 25: మండలంలోని వాటపాగు సచివాలయంలో మహిళా పోలీసుగా పనిచేస్తున్న కె.అంజిలిపై అదే సచివాలయంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆమె భర్త ఎ.ఎర్రన్న గురువారం దాడి చేశాడు. వేరే సచివాలయంలో పనిచేస్తున్న ఎర్రన్న ఇటీవల వాటపాగు సచివాలయానికి డెప్యుటేషన్‌పై వచ్చాడు. భార్యభర్తల మధ్య గత కొంత కాలంగా మనస్పర్థలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సచివాలయంలో వీరిద్దరూ గొడవపడ్డారు. మాటామాటా పెరగడంతో ఎర్రన్న.. అంజిలిని పైకెత్తి కింద పడవేయడంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. స్పందించిన తోటి ఉద్యోగులు 108 వాహనంలో పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అంజలి తలకు ఎనిమిది కుట్లు పడ్డాయి. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు.



గాయపడిన అంజలి

కళ్లకు గంతలు కట్టుకుని..

● మునిసిపల్ ఉపాధ్యాయుల నిరసన ● సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

బెలగాం, జనవరి 25: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మునిసిపల్ ఉపాధ్యాయులు వినూత్నంగా నిరసన తెలిపారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం డీఈవో కార్యాలయం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకుడు మురళీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను పోరాటం చేయకుండా ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. మునిసిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతా తెరవాలని, బదిలీలు చేపట్టాలని, పదోన్నతులు కల్పించాలని, అన్ని పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రెండోసారీ వేలం వాయిదా

● గ్రోత్ సెంటర్లో వ్యాపారి భూమి వేలానికి స్పందన కరువు

బొబ్బిలి: బొబ్బిలి ఏపీఐఐసీ గ్రోత్‌సెంటరులో గల లలితా కనస్ట్రక్షన్ కంపెనీకి చెందిన 4000 చదరపు గజాల స్థలాన్ని గురువారం జీఎస్‌టీ అధికారులు వేలం నిర్వహించారు. ఈ యూనిట్ యజమాని 1.80 కోట్ల రూపాయల జీఎస్‌టీ బకాయిలు చెల్లించాల్సి ఉండడంతో రెవెన్యూ రికవరీ యాక్టు కింద భూమిని వేలం వేస్తున్నట్లు జీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ కె.వెంకటరమణ తెలిపారు. తొలుత గత నెల 27న చదరపు గజం 12 వేల రూపాయల చొప్పున అమ్మేందుకు వేలం నిర్వహించామని, అప్పుడు వేలం పాడేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో చదరపు గజం ధరను పదివేలకు తగ్గించి గురువారం మళ్లీ రెండోసారి వేలం నిర్వహించినా ఎవరూ పాల్గొనలేదని ఆయన అన్నారు. దీనిపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ టి.ఉమాశంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

28న కేంద్ర సాహిత్య అకాడమీ సదస్సు

రాజాం: స్థానిక జేజే ఇన్నోటెల్‌లో ఈనెల 28న రాజాం రచయితల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ సదస్సు నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు గార రంగనాథం ఒక ప్రకటనలో తెలిపారు. అబ్బూరి వరద రాజేశ్వరరావు శత జయంత్యుత్సవం సందర్భంగా జరిగే సమావేశంలో 'అబ్బూరివారి జీవితం.. సాహిత్యం' అనే అంశంపై పత్ర సమర్పణలు, చర్చలు ఉంటాయన్నారు. అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ సి.మృణాళిని, తెలుగు సలహా మండలి సభ్యుడు చింతకింది శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు ఈ సమావేశానికి సాహిత్యాభిమానులు, భాషాభిమానులు, కవులు, రచయితలు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

ఆత్మ పరిశీలనమే ఆధ్యాత్మికత

రేగిడి: ఆత్మ పరిశీలనమే ఆధ్యాత్మికత అని వక్తలు పేర్కొన్నారు. రేగిడి దత్తపీఠంలో గురువారం కిమిడి సత్యనారాయణ అధ్యక్షతన దత్త జ్ఞానబోధ సభ నిర్వహించారు. పాలకొండకు చెందిన సత్యసాయి ప్రతినిధి ఎన్‌వీ రమణ, దత్త పీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టర్, జద్దు జగ్గారావు, జద్దు అప్పలరాము, గుత్తి నర్సింహులు, భక్తులు వై భాస్కరరావు, కుదుతల మురళి, జల్లు శివ, పూతి బాలకృష్ణ, బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ

విజయనగరం దాసన్నపేట: తైక్వాండో జాతీయ స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎం గగన్‌సాగర్ దొర, సీనియర్ మెన్ 87 కేటగిరీలో బంగారు పతకం సాధించారు. అలాగే జి గౌతమ్ జూనియర్ మెన్ 78 కేటగిరీలో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ నెల 18 నుంచి 21 వరకూ జరిగిన ఈ పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్‌ని కైవసం చేసుకున్నారు. వీరిని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు అభినందించారు.

ఉత్తమ బీఎల్‌వోగా మహిళా పోలీస్

తెర్లాం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఉత్తమ బీఎల్‌వోగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ చేతులమీదుగా అవార్డును గురువారం వి.చిన్నయ్యపేట మహిళా పోలీసు చప్ప స్వాతి అందుకున్నారు. అనంతరం ఈ అవార్డు కలెక్టర్ చేతులమీదుగా అందుకోవడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. తన బాధ్యతమరింత పెరిగిందన్నారు. ఆమెను ఎస్ఐ రమేష్‌తోపాటు పలువురు అధికారులు అభినందించారు.

కులగణన నుంచి మినహాయించాలి



ఎంపీడీవోకు సమస్యను వివరిస్తున్న డీటీ

గరుగుబిల్లి: సచివాలయాల పరిధిలోని గ్రామ సర్వేయర్లను కుల గణన సర్వే నుంచి మినహాయించాలని మండల రీసర్వే ఉప తహసీల్దార్ ఎస్.శివు న్నాయుడు కోరారు. గురువారం ఎంపీడీవో జి.పైడితల్లికి సమాచారం అందించారన్నారు. భూముల రీసర్వే చురుగ్గా సాగుతోందన్నారు. అధికారులు సంబంధిత సచివాలయాల సర్వేయర్లను కుల గణనలో పాల్గొనాలని తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. కుల గణనకు సర్వేయర్లు హాజరైతే భూముల వివరాల నమోదులో జాప్యం జరుగుతుందన్నారు. సంబంధిత సమాచారాన్ని జాయింట్ కలెక్టర్, పార్వతీపురం ఆర్డీఓ, గరుగుబిల్లి తహసీల్దార్‌కు అందించామన్నారు. కొందరు సచివాలయ కార్యదర్శులు సర్వేలో పాల్గొంటేనే వేతనాలకు సిఫారసు చేస్తామని... లేదంటే చేయమని తెలిపారన్నారు. ఈ సమాచారంతో గ్రామ సర్వేయర్లు ఆందోళనకు గురవుతున్నారని ఎంపీడీవోకు వివరించారు. దీనిపై ఎంపీడీవో పైడితల్లి స్పందిస్తూ సిబ్బంది కొరత కారణంగా కుల గణన సర్వే వేగవంతం కావడం లేదన్నారు. ఈ మేరకు సచివాలయాల పరిధిలో సిబ్బందిని నియమించామన్నారు.

బినామీ పేర్లతో భూములను దోచుకుంటున్నారు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రామభద్రపురం, జనవరి 25: మండలంలోని డీపట్టా, పోరంబోకు, ప్రభుత్వ భూములను బినామీ పేర్ల మీద పెత్తందారులు దోచుకుంటుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు ఆరోపించారు. ఈ మేరకు గురువారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఆకుల సులోచనారాణికి వినతి పత్రం అందించారు. కొట్టక్కి రెవెన్యూ పరిధిలో సుమారు 460 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని ఆరోపించారు. కొట్టక్కి వీఆర్వో పెత్తందారులకు అండగా ఉంటున్నారని ఆరోపించారు. కొట్టక్కి రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్ల అవినీతిపై సమగ్రమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన భూములు సాగు చేయనీకుండా లబ్ధిదారులను అడ్డుకుంటున్నారని తెలిపారు. వీటిపై సమగ్రమైన విచారణ చేపడతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో కూడా ఎస్ఐ జ్ఞానప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తం

● 'బాబు ష్యూరిటీ..'లో టీడీపీ నేత అదితి గజపతిరాజు



నగరంలో మహిళతో మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, జనవరి 24: చంద్రబాబు నాయుడు రాజమహేంద్రవరం వేదికగా మహానాడులో ప్రకటించిన 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ' బృహత్తర కార్యక్రమమని విజయనగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు అన్నారు. నగరంలోని 12, 16 డివిజన్ల పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని, స్థానిక ప్రజలు, టీడీపీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. సూపర్ సిక్స్‌గా వున్న ఈ హామీలు రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ఉపయోగపడతాయన్నారు. నాలుగున్నర ఏళ్ల కాలంలో ఈ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను అస్తవ్యస్తం చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించిన పలు పథకాలను రద్దు చేసిన ఘనత జగన్ సర్కార్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు జగన్మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా ఓటు వేయాలన్నారు. నగర టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, 12, 16 డివిజన్ నాయకులు యువీ అప్పారావు, రాజేష్, గొలగాని సురేంద్ర, ఇప్పిలి రామారావు, 12, 16 డివిజన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు ప్రాధాన్యం ఇచ్చేది టీడీపీయే





ఎస్.కోట: మాట్లాడుతున్నలలితకుమారి కొత్తవలస: శిక్షణలో పాల్గొన్న నాయకులు

శృంగవరపుకోట, జనవరి 25: మహిళలకు ప్రాధాన్యం ఇచ్చిన పార్టీ తెలుగు దేశమేనని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. గురువారం శృంగవరపుకోట అన్నాక్యాంటీన్ వద్ద ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం గురించి కార్యకర్తలను వివరించారు. క్లస్టర్ పరిధిలో ఉన్న అన్ని యూనిట్స్, బూత్‌ల్లో ఓటర్లను ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. టీడీపీ సానుభూతి పరులు ఓటర్ల జాబితాలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ వేరిఫికేషన్, మన టీడీ పీ యాప్, ఐటీడీపీ టెలిగ్రామ్ బాట్, బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ వంటి అంశాల మీద సుమిత్ర, దీనేష్, సీహెచ్ నాయుడు ఇస్తున్న ఇంటిగ్రేడ్ శిక్షణను అర్థం చేసుకోవాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, రెడ్డి వెంక న్న, కొణదం మల్లేశ్వరరావు, మాకిరెడ్డి లక్ష్మి, ఇందుకూరి శ్రీనిరాజు, కాపుగంటి శ్రీనివాసరావు తదితరులున్నారు. ● **కొత్తవలస:** కొత్తవలసలోని టీడీపీ కార్యాలయంలో గురువారం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లస్టర్స్ పీవీ రత్నాజీ, మాకిన సీతారామపాత్రుడు సారధ్యంలో క్లస్టర్స్ పరిధిలో ఉన్న యూనిట్, బూత్ కన్వీనర్లుకు శిక్షణ ఇచ్చారు. విశాఖపట్టణం నుంచి వినీత్, మహ్మద్ గౌస్, జేపీ రాజు, చందూ రమేష్, రాజ్‌కుమార్‌లు హాజరై శిక్షణ ఇచ్చారు. బంగారు రమేష్, లాలం అర్జునరావు, లెంక శ్రీను, నక్కరాజు చినరాము, కనకాల శివ, గొంప దుర్గా ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.

● **లక్కవరపుకోట:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేసేందుకు పసుపు సైనికులను నియమించి సిద్ధం చేసుకోవాలని విశాఖ టీడీపీ కార్యాలయం నుంచి వచ్చిన ఇంటిగ్రేటెడ్ శిక్షణా నిర్వాహకులు సూచించారు. గురువారం ఎల్.కోటలో గల మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఇంటివద్ద మండలపార్టీ అధ్యక్షుడు చొక్కా కుల మల్లునాయుడు ఆధ్వర్యంలో వేపాడ, ఎల్.కోట మండలాల బూత్ కన్వీనర్ల సమావేశం జరిగింది. ఇందులో క్లస్టర్ కోఆర్డినేటర్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లుకు శిక్షణ ఇచ్చారు. అనంతరం లలితకుమారి మాట్లాడుతూ మరో నెల రోజుల్లో ఈ రాష్ట్రానికి జగనాసుర చీడ వదులబోతుందన్నారు. అందుకు అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. నాయకులు కరెడ్ల ఈశ్వరరావు, కొల్లు రమణమూర్తి, కే.రమణమూర్తి, కె.కన్నబాబు, వై.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం టీడీపీలో జోష్

● పార్టీలోకి భారీగా చేరికలు
● ఆందోళనలో అధికార పార్టీ నేతలు



జాడపేటలో టీడీపీకి కోండ్రు సమక్షంలో జైకొడుతున్న మహిళలు

రాజాం, జనవరి 25: రాజాం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి సానుకూలమైన వాతావరణం కనిపిస్తోంది. వైసీపీ నుంచి చేరికలు పెరుగుతున్నాయి. నాలుగు మండలాల్లోనూ తెలుగుదేశం పార్టీకి ఆదరణ కనిపిస్తోంది. గత ఎన్నికల్లో రాజాం, సంతకవిటి మండలాల్లో టీడీపీకి ఫర్వాలేకున్నా.. రేగిడి, వంగర మండలాల్లో పూర్తిగా వెనుకబడింది. ఇప్పుడు ఆ రెండు మండలాల నుంచి టీడీపీలోకి చేరికలు భారీగా పెరిగాయి. సంతకవిటి మండలం నుంచి కూడా చేరికలు పెరుగుతున్నాయి. ఇవన్నీ టీడీపీకి కలిసి వస్తున్నాయి. మొత్తానికి పార్టీలో భారీగా చేరికలతో రాజాం నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల్లో గెలుపుపై విశ్వాసం పెరుగుతోంది. టీడీపీకి పెరుగుతున్న ఆదరణను చూసి వైసీపీ నేతలు, శ్రేణుల్లో గుబులు పుడుతోంది.

రేగిడి మండలంలో వంద కుటుంబాలు

రేగిడి: జాడపేటకు చెందిన యాదవులు, ఇతర కులాలకు చెందిన వంద కుటుంబాల వారు గురువారం టీడీపీకి జైకొట్టారు. యాదవ కుల సంఘం ప్రెసిడెంట్ అల్లమన రాములు, ప్రతినిధులు అప్పన్న, అశిరయ్య, శ్రీను, కొన్నా వెంకన్న, కొన్నా రాములు, కారు గంగయ్య, ములుగు అప్పయ్య, టొంపల రమేష్, బండి సూరయ్య, పెద్దసంఖ్యలో మహిళలు మాజీ మంత్రి కోండ్రు సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మండల టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్, మజ్జి శ్రీనివాసరావు, గేదెల బాలమురళీధర్, పాలూరి రామినాయుడు, గురవాన ధనంజయ్, మాజీ జెడ్‌పీటీసీ మంతిన ఉషారాణి, చల్ల భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

రామభద్రపురం, జనవరి 25: మండల కేంద్రంలో వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపట్టారు. ఏఎస్ఐ లెంకా గోపీనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు కార్లను తనిఖీ చేశారు. అలాగే గంజాయి ఇతర మత్తు పదార్థాలు ఒడిషా రాష్ట్రం నుంచి రవాణా జరుగుతున్నదని, దీనిని అరికట్టడానికి ఇక్కడ స్పెషల్‌గా చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, కానిస్టేబుళ్లు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖజానాలోని నిరుపయోగ పత్రాలు దహనం



చెక్కు బుక్కులను దహనం చేస్తున్న దృశ్యం

కలెక్టరేట్: జీవో 135 ప్రకారం ప్రభుత్వం వారు ఖజానా కార్యాలయంలో భద్రపరిచిన ఉపయోగంలో లేని చెక్ బుక్కులను దహనం చేయడానికి జిల్లా స్థాయి కమిటీ జేసీ మయూర్ అశోక్ అధ్యక్షతన ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఉదయం కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో జిల్లా ఖజానా స్ట్రాంగ్ రూం వద్ద జిల్లా ఖజానా కార్యాలయంలో ఉన్న నిరుపయోగ చెక్ బుక్‌లను దహనం చేసినట్లు జిల్లా ఖజానా అధికారి ఆర్ఎఎస్ కుమార్ వెల్లడించారు.

నూతన కార్యవర్గం



కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న నాయకులు

విజయనగరం, జనవరి 25: కొప్పుల వెలమ సామాజికవర్గ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గురువారం వీరి సంక్షేమ సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అధ్యక్షులుగా బొత్స వరప్రసాదరావును ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా శీర సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షులుగా దొగ్గ దేముడుబాబు, ప్రధాన కార్యదర్శిగా తెంటు కాశీనాయుడు, కోశాధికారిగా కె.కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు గొట్టాపు చిన్నంనాయుడు, రాష్ట్ర అధ్యక్షులు కిలపర్తి పరదేశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి కుంబాభిషేకం



విజయనగరం రూరల్: నగరంలోని సిటీ బస్టాండ్‌లో కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం ఆలయ ప్రాంగణంలో కుంబాభిషేకం నిర్వహించారు. గాయిత్రీ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళలంతా సామూహిక అర్చన నిర్వహించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి



మాట్లాడుతున్న సీఐ

శృంగవరపుకోట: లా అండ్ ఆర్డర్‌ను కాపాడేందుకు ప్రజలు సహకరించాలని పట్టణ సీఐ మురళీరావు అన్నారు. గురువారం శృంగవరపుకోట పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో పాత్రికేయులు భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. పట్టణంలో ఆక్రమణల తొలగింపునకు సహకరించాలన్నారు. ఈ ఆక్రమణలతో స్థానికంగా ఇబ్బందులు వస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రయాణాలు సాఫీగా సాగినప్పుడే మన ఊరికి, పట్టణానికి మంచి పేరొస్తుందన్నారు. ఎస్.ఐలు గంగరాజు, మోహన్ రావు ఉన్నారు.

పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ..

● ఒడిశా వాసి సైకిల్ యాత్ర



విజయనగరం చేరుకున్న సైకిల్ యాత్రికుడు చిన్నారావు

విజయనగరం, జనవరి 25: ఒడిశాలోని కొరాపుట్ జిల్లా సిమిలిగూడ గ్రామానికి చెందిన ఎస్.చిన్నారావు ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ సైకిల్ యాత్ర చేస్తున్నారు. గురువారం విజయనగరం మండలం జొన్నవలసలో తన సైకిల్ యాత్ర ముగించారు. మొత్తం 230 కిలోమీటర్ల మేర యాత్ర సాగిందని తెలిపారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మట్లాడారు. స్వచ్ఛ భారత్ సాధన కోసం... పరిసరాలను శుభ్రంగా ఉంచాలని... మొక్కలు నాటి పర్యావరణానికి మేలు చేయాలని... పాలిథిన్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా విడనాడాలని ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. మనకు స్వచ్ఛమైన పాలనను అందించే వారికే ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. మద్యానికి, బిర్యానీలకు ఓటు హక్కును అమ్ముకోవద్దు అంటూ ప్రజలకు వివరిస్తున్నారు. కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాలతో పాటు సాలూరు మీదుగా విజయనగరంలోని జొన్న వలసకు చేరుకున్నారు. ఒడిశాలోని దేవుమాలి శిఖరాలను గతంలో అధిరోహించడంతో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నట్టు చిన్నారావు చెప్పారు.

సర్పంచ్‌కు తెలియకుండా సమావేశం

● వైసీపీకి తొత్తుల్లా మారారని ఎంపీడీవో, ఈవోపీఆర్డీలపై విమర్శలు



సర్పంచ్ లేకుండా గ్రామసభ నిర్వహిస్తున్న ఎంపీడీవో

లక్కవరపుకోట, జనవరి 25: రంగారాయపురం పంచాయతీలో గురువారం ఉపాధి హామీ గ్రామాభివృద్ధికి సంబంధించిన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తాను వస్తున్నానని తెలిసి వైసీపీ నేతల సూచనలతో ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీలు వేదికను మార్చేశారని సర్పంచ్ కరెడ్ల రామలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్వం నుంచి గ్రామంలో ఏ సమావేశమైనా రామాలయంలో నిర్వహిస్తామని... దీనికి భిన్నంగా సమావేశపు వేదికను మార్పు చేస్తున్నారని అధికారులపై విమర్శలు గుప్పించారు. టీడీపీ నుంచి తమను గ్రామ ప్రజలంతా ఎన్నుకున్నారని.. సమావేశాలు వైసీపీ నేతల ఇంటిలో పెడితే నిబంధనలకు విరుద్ధంగా అధికారులు హాజరు కావడం ఏమిటని ప్రశ్నించారు. రామాలయంలో కాకున్నా కనీసం సచివాలయంలోనైనా సమావేశం నిర్వహిస్తారేమోనని తాను వచ్చినట్టు తెలిపారు. తీరా చూస్తే అక్కడి నుంచి మరో చోటుకు మార్చేశారని తెలిపారు. మండల స్థాయి అధికారులంతా కుమ్మక్కై రంగారాయపురం గ్రామంపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని రామలక్ష్మి పేర్కొన్నారు.

ఓటర్లకు అవగాహన

బొబ్బిలి: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు, సామాజిక కార్యకర్త, న్యాయవాది తుమరాడ గంగాధర్‌లు గురువారం 'ఓటర్ బీ అవేర్- సేవ్ డెమోక్రసీ' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక లోక్‌సత్తా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవడాన్ని తప్పనిసరి చేయాలన్నారు.

జూట్ మిల్లు భూముల్లోకి రావొద్దు

● కొనుగోలుదారులను అడ్డుకున్న కార్మికులు



కొనుగోలుదారులు, కార్మికుల మధ్య వాగ్వాదం దృశ్యం

బొబ్బిలి, జనవరి 25: బొబ్బిలి పట్టణంలో మూతపడి అమ్ముబడిన జూట్ మిల్లును ఇంకా వివాదం చుట్టుముడుతూనే ఉంది. మిల్లుకు చెందిన 7.40 ఎకరాల భూమిని ఎన్‌సీఎల్‌టీ ద్వారా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు 2019లో కొనుగోలు చేసుకున్నారు. అప్పటి నుంచి వారు ఆ భూముల్లోనికి వెళ్లలేకపోతున్నారు. మిల్లులో పనిచేసే సుమారు 1300 మంది కార్మికులకు సంబంధించిన పీఎఫ్, గ్రాట్యుటీ బకాయిలను చెల్లించకపోవడమే అందుకు కారణం. ఈ క్రమంలో భూములను కొనుగోలుచేసుకున్న వ్యాపారులు గురువారం ఆ ప్రాంగణంలోనికి వెళ్లి పనులు చేపట్టేందుకు ఉపక్రమించారు. విషయం తెలుసుకున్న జూట్ కార్మికులంతా అక్కడికి చేరుకొని వారిని అడ్డుకున్నారు. ఈ సమయంలో ఇరుపక్షాల మధ్య వాదోపవాదనలు జరిగాయి. గతంలో జూట్‌యాజమాన్యానికి-కార్మిక సంఘానికి మధ్య జరిగిన ఒప్పందం మేరకు 1.63 కోట్ల రూపాయల పీఎఫ్, గ్రాట్యుటీ బకాయిలు చెల్లిస్తే గాని, మిల్లు భూముల్లోనికి ఎవరినీ అనుమతించబోమని కార్మిక నాయకులు శేషగిరి తదితరులు గట్టిగా తేల్చి చెప్పారు. కార్మికుల బకాయిలతో తమకు ఎటువంటి సంబంధం లేదని, తాము ఎన్‌సీఎల్‌టీ దగ్గర భూములు కొనుగోలు చేశామని, శ్రీలక్ష్మీ శ్రీనివాసాజూట్‌మిల్లు యజమాని కేవీఆర్‌తో మీరు తేల్చుకోవాలని వ్యాపారులు కింతలి మురళి, గ్రంధి ముత్యాలు, గిరి తదితరులు వాదించారు. ఇరుపక్షాలు కలిసి జూట్ మిల్లు యజమాని అయిన కేవీఆర్‌పై గట్టిగా ఒత్తిడి తెచ్చేందుకు వెళ్దామని నిర్ణయించారు. దీనితో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

బీసీలకు తీవ్ర అన్యాయం

● మాజీ మంత్రి కోండ్రు

వంగర: వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని మాజీ మంత్రి కోండ్రు మురళీ మోహన్ అన్నారు. గురు వారం మండలకేంద్రంలో జయహో బీసీ కార్యక్ర మం నిర్వహించి మాట్లా డారు. సీఎం జగన్ బీసీలపై కక్షకట్టి 30 పథకాలు ఎత్తేశారని గుర్తుచేశారు. వేల మంది బీసీ తమ్ముళ్లపై అక్రమకేసులు బనాయించిన ఘనత కూడా జగన్‌కు దక్కుతుందన్నారు. మద్యం ధరలు పెంచడంతో పాటు నాసిరకం మద్యం అమ్మ కాలు చేసి 36 వేలమంది అనారోగ్యం పాలవ్వటానికి కారకులయ్యారన్నారు. నా మినేటడ్ పదవులు ఒక్కరికైనా బీసీలకు జగన్ ఇచ్చాడా అని ప్రజలు గుర్తించాలన్నారు. వైసీపీని సాగనంప టానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వంగర, రాజాం టీడీపీ నాయకులు పిన్నింటి మోహన్, బొత్సవాసుదేవరావు నాయుడు, ధనలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజాం మండలం నాయకులతో రివ్యూ

రాజాం: రాజాం మండలం పరిధిలోని గుయ్యన్నవలస, పొగిరి, గురవాం, అంతకాపల్లి, పంచాయతీలకు సంబంధించి నాయకులతో గురువారం కోండ్రు మురళీమోహన్ రివ్యూ నిర్వహించారు. పంచాయతీల్లో ఓటర్లు, టీడీపీ మద్దతుదారుల వివరాలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయితీల్లో కష్టపడి పనిచేసి మెజార్టీ ఓట్లు వచ్చేలా కృషిచేయాలని నాయకులకు సూచించారు. గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, దూబ ధర్మారావు, జరజాన నీలయ్య, శాసపు రమేష్‌కుమార్, టంకాల కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● సంకతవిటిలో ఘనంగా నిర్వహించిన షిరిడీ సాయి ఆలయం వార్షికోత్సవ వేడుకల్లో కోండ్రు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మంచి బుద్ధిని ప్రసాదించి వైసీపీ పాలనకు అంతం పలికాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మాజీ తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ కొళ్ల అప్పలనాయుడుకు సముచిత స్థానం కల్పిస్తామని కోండ్రు హామీఇచ్చారు. కొళ్ల అప్పనాయుడు, గట్టి బాను, చెలికాని మహేష్, చల్లా శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

బంగారు నగలు చోరీ

వంగర: బంగారు నగలు చోరీకి గురైన ఘటన వంగరలో గురువారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వంగర పోలీసు స్టేషన్ సమీపంలో నివాసముంటున్న వారాడ సూరమ్మ గురువారం సాయంత్రం పక్కవీధిలోని తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి బీరువా తాళాలు పగలుగొట్టి ఉమారు రూ.లక్ష విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించింది. దీనిపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన ఎస్సై జనార్దనరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జనార్దనరావు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రేగిడి: ఉంగరాడ సమీపంలో గురువారం నిర్వహించిన తనిఖీలో ఐదుగురు పేకాటరాయుళ్లను పట్టుకొని... వారి నుంచి రూ.5860 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సారా తయారీ కేంద్రంపై దాడి

రామభద్రపురం: మండల పరిధిలోని కొండగుడ్డివలస గ్రామంలో సారా తయారీ కేంద్రంపై దాడి చేసి సుమారు వెయ్యి లీటర్ల సారా తయారీకి ఉపయోగించే ద్రావణాన్ని స్వాధీనం చేసుకుని దాన్ని ధ్వంసం చేసినట్టు ఎస్.ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై కొరడా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఇసుక ట్రాక్టర్లు

రేగిడి, జనవరి 25: ఉంగరాడమెట్ట వద్ద రెండు ట్రాక్టర్లపై రెవెన్యూ శాఖ కొరడా ఝుళిపించింది. గురువారం ఉంగరాడమెట్ట వద్ద తహసీల్దార్ సుదర్శనరావు, ఆర్ఐ రేవతి రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేయగా, ముందురోజు ఇదే ప్రాంతంలో మరో రెండు ట్రాక్ట ర్లకు అపరాధ రుసుం విధించినట్లు ఆర్ఐ తెలిపారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.3 వేల వంతున అపరాధ రుసుం విధించినట్లు ఆర్ఐ వెల్లడించారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్‌లను బాధితులకు అందజేస్తున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైం, జనవరి 24: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 139 మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసి వాటిని బాధితులకు గురువారం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ గోవిందరావు అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ సెల్‌కి పోలీసులకు వచ్చిన ఫిర్యాదులు ఆధారంగా పోయిన మొబైల్స్‌ని ట్రేస్ చేసేందుకు సైబర్ సెల్ పోలీసులు, సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. జిల్లా ఎస్పీ దీపికా ఆదేశాలతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను బాధితులకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సైబర్ సెల్ ఎస్ఐలు ప్రశాంత్‌కుమార్, నజీమాబేగం, సైబర్ సెల్ కానిస్టేబుల్స్ వాసుదేవ్, శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సరైన కొలతలతో గిట్టుబాటు వేతనం

రేగిడి, జనవరి 25: ఉపాధి వేతనదారులు రెండు పూటలా కొలతలు, ప్రమాణాలు పాటిస్తే వేతనం రూ.272 గిట్టుబాటు అవుతుందని ఏపీఓ హరనాథ్ సూచించారు. రేగిడి సాయన్న చానల్ పరిధిలో ఉపాధి పనులను, మస్టర్ రోల్‌ను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎఫ్ఏ లక్ష్మణ్ ఉన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

మెరకముడిదాం: మండలంలోని యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పనకు సంబంధించి ఈనెల 27వ తేదీన మండల సమైఖ్య కార్యాలయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వ హిస్తామని ఏపీఎం ఉమామహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ, బీటెక్ విద్యార్హత కలిగిఉండి 18 నుంచి 28 ఏళ్ల వయస్సుగలవారు మండల కార్యాలయంలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు. ఎంపికైన వారికి విజయనగరం మహిళా ప్రాంగణంలో శిక్షణ నిర్వహించి, తదుపరి ఉపాధి కల్పిస్తామని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులకు గౌరవమేదీ?

ఎస్.కోట మండల సర్వసభ్య సమావేశంలో నిలదీత



సచివాలయ కార్యదర్శిని ప్రశ్నిస్తున్న ఎంపీపీ

శృంగవరపుకోట, జనవరి 25: మండల, గ్రామ స్థాయిలో పని చేస్తున్న అధికారులు ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వడం లేదని ఎంపీపీ సండి సోమేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం శృంగవరపుకోట మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశం ముగింపు దశలో స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో మాట మాత్రమైనా తనకు సమాచారం ఇవ్వకుండా సచివాలయ కార్యదర్శి రెండు రోజుల క్రితం వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేయడంపై సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి అభ్యంతరం వ్యక్తం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలకు పిలవలేదని, కొత్త పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచారని ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసయ్య ప్రస్తావించారు. ఇది ఎస్సీ, ఎస్టీ సర్పంచ్‌లను అగౌరవపరచడమేనని అన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే విధంగా అధికారులు ప్రవర్తించడం బాగోలేదని ఎంపీపీ నిరసన వ్యక్తం చేశారు. తనకు కూడా సొంత గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శేషుబాబు, ఈవోపీఆర్డీ ఐ.వి.లక్ష్మిలకు సూచించారు. అంతకముందు విద్యాశాఖ ప్రగతిపై చర్చలో గిరిశిఖర గ్రామం దారపర్తి పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులు గైర్హాజరవుతుండడంతో సభ్యులు నిలదీశారు. పరిస్థితిని చక్కదిద్దాలని వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు ఎంఈవోను కోరారు. ఏపీఈపీడీసీఎల్ సహాయ ఇంజనీర్ రవికుమార్, జెడ్పీటీసీ వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటీసీలు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. కొంతమంది సభ్యులు సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. మిగిలిన వారు కాలక్షేపానికి వచ్చినట్టు కూర్చున్నారు.

టీడీపీలో 500 కుటుంబాల చేరిక



సంధ్యారాణి ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న నెలిపర్తి గ్రామస్థులు

సాలూరు: నెలిపర్తి గ్రామంలో గురువారం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి ఆధ్వర్యంలో సుమారు 500 కుటుంబాలు పార్టీలో చేరాయి. గ్రామంలో సుమారు 300 కుటుంబాలు యాదవులు, ఎస్సీలు 100 కుటుంబాలు, పద్మశాలీలతో పాటు మొత్తం 500 కుటుంబాలు సంధ్యారాణి, మండల అధ్యక్షులు పరమేష్, ఎక్కుడు గణపతి ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. ఈసందర్భంగా ఆమె మాటాడుతూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించామని తెలిపారు. గ్రామ పొలిమేర వరకు స్థానికులు వచ్చి పూలదండలు వేసి మేళతాళాలతో ఘనంగా ఊరేగించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శివ, లింగాల గాంధీ, అక్యాన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపయోగించని చెక్‌బుక్‌లు రద్దు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం మన్యం జిల్లాలో ఉపయోగించని చెక్‌బుక్‌లు, వస్తువులను రద్దు చేశామని జిల్లా ట్రెజరీ అధికారి మన్మథరావు తెలిపారు. ఆయన గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 2018 ఏప్రిల్‌కు ముందు చెక్‌బుక్‌లు ట్రెజరీలలో అందుబాటులో ఉండేవని, ఆ తర్వాత నుంచి సీఎఫ్‌ఎంఎస్ విధానం అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. దీంతో చెక్‌బుక్‌లు వాటికి సంబంధించిన వస్తువులు ప్రస్తుతం ఉపయోగించడం లేదన్నారు. అలాంటి వాటిని జిల్లా స్థాయి కమిటీ వేసి రద్దు పర్చాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ కమిటీకి జేసీని ఛైర్మన్‌గా ఏర్పాటు చేశారని తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో చెక్‌బుక్‌లను, సామగ్రిని రద్దుపరిచి కాల్చివేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి మన్మథరావు, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆర్.ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ ట్రెజరీ అధికారి శ్రీనివాసరావు, పార్వతీపురం సబ్ ట్రెజరీ అధికారి దూలం ప్రసాద్, కురుపాం ట్రెజరీ అధికారి శంకరరావు, పాలకొండ సబ్ ట్రెజరీ అధికారి భాస్కరరావు, సాలూరు సబ్ ట్రెజరీ అధికారి కామినాయుడు, జిల్లా ట్రెజరీ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో బంగారంషాపు యజమాని మృతి

పార్వతీపురంటౌన్: పట్టణానికి చెందిన ఓ బంగారం షాపు యజమాని గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ ప్రధాన రహదారిలో శ్రీమహాలక్ష్మి జ్యూయలరీ పేలస్ యజమాని యిందుపూరు తేజ(33) బుధవారం సాయంత్రం గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స అందుతున్న సమయంలో మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్సీ డి.జగదీష్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు, పలువురు నివాళులు అర్పించారు.

చెరకు లారీ బోల్తా



గారమ్మ కాలనీ కూడలి వద్ద బోల్తా పడిన చెరకు లారీ

పాలకొండ: పట్టణంలోని గారమ్మ కాలనీ కూడలి వద్ద గురువారం ఓ చెరకు లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడి, కళ్లజోడు దుకాణంపై పడింది. ఆ సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. దుకాణానికి చెందిన ఉప్పాడ లక్ష్మి, ఉప్పాడ ఈనాడు, ఉప్పాడ సరోజ, అప్పన్న తమకు రూ.లక్షలు నష్టం వాటిల్లిందని వాపోయారు.

రావుపల్లిలో గడ్డి వాములు దగ్ధం

గరుగుబిల్లి: రావుపల్లిలో గురువారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన గుంట్రెడ్డి గౌరు నాయుడు, శ్రీనివాసరావులకు చెందిన సుమారు 10 ఎకరాలకు చెందిన వరి గడ్డి అగ్నికి ఆహుతయ్యింది. మామిడి చెట్లుకు కూడా నష్టం జరిగింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ జీవీ జనార్దన్, వీఆర్వో టి.శ్రీనివాసరావులు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. పార్వతీపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.



దగ్ధమవుతున్న గడ్డివాములు

బెల్లపు ఊట ధ్వంసం

సీతంపేట: మర్రిపాడు పంచాయతీ రేగులగూడ కొండ ప్రాంతంలో సారా వంటకాలు చేస్తున్నారనే సమాచారంతో సీతంపేట పోలీసులు, స్పెషల్ బ్రాంచి సిబ్బంది గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సారా తయారీకి అవసరమైన 900 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. దీంతో పాటు మరో 50 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. సారా తయారుచేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో స్పెషల్ బ్రాంచి హెడ్ కానిస్టేబుల్ సింహాచలం, త్రినాధరావు, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో మిషన్ల పరిశీలన

జియ్యమ్మవలస: చినమేరంగి సీహెచ్‌సీని బయో మెడికల్ ఇంజనీర్ బి.కళ్యాణి గురువారం సందర్శించారు. ఆసుపత్రిలో ఉన్న మిషన్ల పనితీరును పరిశీలించారు. ఆసుపత్రిలో టెక్నీషియన్‌ను నియమించి సుమారు ఏడాది కావస్తున్నా ఇంకా ఎక్స్‌రే మిషన్ మంజూరు చేయలేదనే ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ ఇప్పటికే ఆటోమేటిక్ ఎనర్జిటిక్ రెగ్యులేటెడ్ బోర్డు (ఏఆర్‌బీ) అనుమతికి ఈ విషయాన్ని చేరవేశామని తెలిపారు. ఏప్రిల్ నెలలో మంజూరవుతుందని చెప్పారు. ఆమె వెంట హెడ్ నర్సు పార్వతి, స్టాఫ్‌నర్సు గోవిందమ్మ ఉన్నారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభం

గరుగుబిల్లి: సంతోషపురంలో గ్రామ సచివాలయ భవనంతో పాటు రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి గురువారం ప్రారంభించారు. పెద్దూరులో రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లాల జడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, మాజీ ఎంపీపీ ద్వారపురెడ్డి ధనుంజయరావు, ఎంపీడీవో జి.పైడితల్లి, మండల ఇంజినీరింగ్ అధికారి గోపీ గౌరీశంకరరావు, ఏవో ఆర్.విజయభారతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

●పెన్షన్‌దారుల డిమాండ్ ● జిల్లా వ్యాప్తంగా ఆందోళన

పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సంఘ యూనియన్ నాయకుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు. 2022 జనవరి 1 నుంచి 11వ పీఆర్సీలో తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను గతంలో అందించిన విధంగా అందజేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. అలాగే 11వ పీఆర్సీ ఏరియర్స్ చెల్లించాలన్నారు. హెల్త్‌కార్డుల ద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో వైద్యం అందించాలని కోరారు. మెడికల్ రీఇంబర్స్‌మెంట్ పరిధి 2 లక్షల నుంచి 5 లక్షల వరకు పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్షన్‌దారులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



గంట్యాడ: నిరసన వ్యక్తంచేస్తున్న పెన్షనర్లు



గజపతినగరం: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో..



చీపురుపల్లి: ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ నేత సత్యం



రాజాం: మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు గౌరీశంకర్



భోగాపురం: నిరసన తెలియజేస్తున్న పెన్షన్‌దారులు



కురుపాం: ఆర్డీవో లావణ్యకు వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్లు



గరివిడి: నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షన్‌దారులు

టీడీపీదే విజయం



బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న విజయచంద్ర

పార్వతీపురం రూరల్: వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. లక్ష్మీనారాయణపురం గ్రామంలో గురువారం ఆయన ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి వైసీపీ పాలనలో ఎన్నో ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. సీతానగరం వంతెన నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేశారని, వరహాలగెడ్డ ద్వారా జంఝావతి హైలెవెల్ కెనాల్ ద్వారా లక్ష్మీనారాయణపురం భూములకు సాగునీరు అందిస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చలేకపోయారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు వెంకటనాయుడు, టీడీపీ నాయకులు తెర్లి రవి, కొత్తాడ శ్రీనివాసరావు, వడిగల శంకర్, జమితిరెడ్డి బాల, ఎల్‌పి రామకృష్ణ, తెర్లి సింహాచలంతో పాటు పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

సీతానగరం: స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌చార్జిలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర పాల్గొని, మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. వివిధ గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సరిచూసుకోవాలి



మాట్లాడుతున్న జయకృష్ణ

పాలకొండ: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్క పోలింగ్ బూత్‌లో ఓటరు జాబితా సరిచూసుకోవాలని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ పార్టీ కార్యకర్తలకు సూచించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల నాయకులతో గురువారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమం లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు, పార్టీ నాయకులు కిమిడి కాశీంనాయుడు, కోడి శ్రీహరి, సురవరం సుందరరావు, జీలకర్ర మోహన్‌రావు, సిరిపురం జగదీష్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

సీతానగరం: వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌చార్జిలు పనిచేయాలని ఇంటిగ్రేడ్ సెంట్రల్ టీం శిక్షకుడు సత్తిబాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్ నాయుడు అధ్యక్షతన ఇంటిగ్రేడ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెంకి మోహన్‌రావు, క్లస్టర్ ఇన్‌చార్జి ఎన్.రాంబాబు, జి.బాబ్జీ, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఘనంగా ఓటర్ల దినోత్సవం

కురుపాం: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని కురుపాంలో పాలకొండ ఆర్డీవో ఎం.లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సిటిజన్ ఓటర్లకు సన్మానించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈసందర్భంగా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటర్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, ఎన్నికల డీటీ బి.నాగేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు. ● అర్హులైన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ విద్యార్థులను కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు వినియోగం, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ● **సీతంపేట:** అర్హులైన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక యూత్ ట్రైనింగ్ శిక్షణా కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువ ఓటర్ల చేతుల్లోనే ఉంటుందన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్ ఓటర్లకు సన్మానం చేశారు. తహసీల్దార్ నరసింహమూర్తి, ఎంపీడీవో గీతాంజలి, వెంకటరమణ పాల్గొన్నారు.





కురుపాం, సీతంపేట: మాట్లాడుతున్న ఆర్డీవో లావణ్య, ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

పోలింగ్ కేంద్రాల పనులు వేగవంతం

భామిని: పోలింగ్ కేంద్రాల పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి మండల అధికారులకు సూచించారు. ఘనసర, బురుజోల, సింగిడి పోలింగ్ కేంద్రాలను ఆమె గురువారం సందర్శించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులోగా పోలింగ్ కేంద్రాల్లో నీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఇతర మౌలిక సదుపాయాలు ఉండాలని ఆదేశించారు. ఎటువంటి సమస్యలున్నా నేరుగా తెలపాలన్నారు. తహసీల్దార్ అప్పారావు, పీఆర్ జేఈ గౌరీశంకర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సందీప్‌కుమార్, ఎంఈవో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్వోలకు ప్రశంసా పత్రాలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఎన్నికల విధులకు సంబంధించి అంకితభావంతో పనిచేస్తూ సేవలందించిన పలువురు బీఎల్వోలకు, సూపర్‌వైజర్లకు జేసీ గోవిందరావు గురువారం ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై పర్యవేక్షణేదీ?

సీతంపేట: మండలంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులపై మండల పర్యవేక్షణ అధికారి పూర్తిస్థాయి పర్యవేక్షణ లేకపోవడం వల్లే పనులు నత్తనడకన సాగుతున్నాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మండలంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు సగం కూడా నిర్మాణం జరగలేదని, పూర్తి చేసిననవి కూడా ప్రారంభించని పరిస్థితి ఉందన్నారు. గిరిజన గ్రామాల్లో చేపడుతున్న జలజీవన్ పనుల్లో నాణ్యత లోపించిందని, ఎక్కడా తాగునీరు రాని పరిస్థితి ఉందని తెలిపారు. కలెక్టర్ స్పందించి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు ఎం.లక్ష్మణ్, ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలో గురువారం కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి నాలుగో విడత ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

నిర్దేశించిన సమయంలోగా సర్వే పూర్తి చేయాలి

గరుగుబిల్లి: గ్రామాల్లో కుల గణన సర్వేను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర, మరుపెంట, సాంబన్నవలస, గొట్టివలస, పెద్దూరు, రావుపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను వారు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేలో మండలం వెనుకంజలో ఉందని, ఉన్నతాధికారులు సర్వే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రతి వలంటీరు తమ పరిధిలోని 50 గృహాలకు సంబంధించి సర్వే పూర్తి చేయాల న్నారు. ఈ పరిశీలనలో ఏవో ఎన్.అర్జునరావు, సర్పంచ్ బి.చంద్రినాయుడు, కార్యదర్శులు టి.భాస్కరరావు, భార్గవ్‌నాయుడు, జి.జనార్దన్‌నాయుడు, కోటేశ్వరరావు ఉన్నారు.

వేతనదారుల సంఖ్య పెంచాలి

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో ఉపాధి పనులకు వేతనదారుల సంఖ్య పెంచాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగిశాయని, నిర్దేశించిన మేరకు వేతనదారులు పనుల్లో పాల్గొనేలా దృష్టి సారించాలని సూచించారు. అవకతవకలకు పాల్పడకుండా సక్రమంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఏపీఎం ఎం.గౌరీనాథ్, ఈసీ ఎ.గోపాలకృష్ణ పట్నాయక్, టి.తిరుపతిరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సీతంపేటలో వర్షం

సీతంపేట: సీతంపేట మన్యంలో గురువారం తెల్లవారుజామున వర్షం కురిసింది. దీంతో రబీ సాగులో వేసిన శెనగ రైతులు, జీడి, మామిడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటుకల తయారీ వ్యాపారులు అకాల వర్షం కారణంగా నష్టపోయినట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా..

ఏఎంసీ మూడో గ్రేడ్ కార్యదర్శిగా ప్రసాదురాజు

పార్వతీపురంటౌన్: ఏఎంసీ మూడవ గ్రేడ్ కార్యదర్శిగా వి.ప్రసాదురాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి ఏఎంసీలో అసిస్టెంట్ సెక్రటరీగా ఉంటూ పార్వతీపురం ఏఎంసీ మూడో గ్రేడ్ కార్యదర్శిగా ఈయన పదోన్నతపై వచ్చారు.

రహదారి పన్ను కట్టాల్సిందే

గుమ్మలక్ష్మీపురం: మండలాల్లో ఆర్టీవో మల్లికార్జున రెడ్డి గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఇంతవరకు రోడ్ ట్యాక్స్ కట్టనివారు డిసెంబరు నెలాఖరు నాటికి కట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఆటో, ట్రక్కర్లలో అధిక లోడుతో వెళ్లినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కురుపాం ఎస్ఐకి ప్రశంసాపత్రం

కురుపాం: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరించినందుకు కురుపాం ఎస్ఐ షణ్ముఖరావుకు పార్వతీపురం ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసాపత్రం ఇచ్చి అభినందించారు.

ఓటును అమ్ముకోవద్దు

పాచిపెంట: ఓటును అమ్ముకోవద్దని కోరుతూ ఒడిశా వాసి సైకిల్ యాత్ర ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఒడిశా ప్రాంతం సిమిలిగూడకు చెందిన షావుకారు చిన్నారావు సైకిల్ యాత్ర చేస్తున్నారు. ఓటును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని.. ఓటును మందు, బిర్యానీ, డబ్బుకు అమ్ముకోవద్దని ప్రచారం చేస్తున్నారు.



సైకిల్ యాత్ర చేస్తున్న ఒడిశా వాసి

సెల్ టవర్ ప్రారంభం

కురుపాం రూరల్: గంగన్న దొరవలస గ్రామంలో జియో సంస్థ నిర్మించిన సెల్ టవర్‌ను ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వర్చువల్‌గా గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఐటీడీఏ పీవో విష్ణుచరణ్, నీలకంఠాపురం సర్పంచ్ మన్మథరావు, వైస్ ఎంపీపీ అన్నాజీరావు, వెలుగు సిబ్బంది హాజరయ్యారు.

హెచ్ఐవీ రోగులకు వైరల్ లోడ్ టెస్ట్

పాలకొండ: స్థానిక ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా.నాగభూషణం ఆధ్వర్యంలో హెచ్ఐవీ రోగులు 195 మందికి వైరల్ లోడ్ టెస్ట్ గురువారం చేశారు. ఇది ప్రతి సంవత్సరంలో ఒకసారి ఈ విధమైన రక్తపరీక్షలు అనేవి నిర్వహిస్తామని, మందులు వాడుతున్న రోగుల్లో మందు ప్రభావం ఏ విధంగా ఉందని తెలుసుకోవడానికి ఈ విధంగా టెస్ట్‌లు నిర్వహిస్తామని చెప్పారు.

బస్సుల్లో రద్దీ

మక్కువ: సంక్రాంతి, శంబర పోలమాంబ జాతరలకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తిరిగి స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమవడంతో బస్సులన్నీ రద్దీగా మారాయి. సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇప్పటికైనా బస్సు సర్వీసులు పెంచాలని కోరుతున్నారు.

ఒడిశా

భాషా సంస్కృతులను కాపాడుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రాయగడ: 'మన భాష, కళ, సంస్కృతులు చాలా గొప్పవని.. వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గిరిజన శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. స్థానిక తేజస్వీ మైదానంలో గురువారం గిరిజన, భాష, కళా, సాంస్కృతిక ఉత్సవాలు జరిగాయి. ప్రత్యేక అభివృద్ధి మండలి అధ్యక్షురాలు అనసూయ మాఝి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. గౌరవ అతిథిగా జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి పాల్గొన్నారు. అనంతరం 11 సమితుల నుంచి వచ్చిన విద్యార్థులు, కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో రాయగడ సమితి అధ్యక్షురాలు టునిహాయిక, ఆదివాసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఓటరు దినోత్సవం

రాయగడ: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా యంత్రాంగం గురువారం స్థానిక గజపతి కూడలి నుంచి బిజూ పట్నాయక్ ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీని అదనపు కలెక్టర్ భాస్కర చంద్రరాయిత్, సబ్‌కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవిలు జెండా ఊపి ప్రారంభించారు. బిజూపట్నాయక్ ఆడిటోరియంలో జరిగిన సభలో ఓటు వినియోగించుకునే అంశంపై అవగాహన కల్పించా రు. ర్యాలీలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రాయగడ జిల్లాకు కొత్త ఎస్పీ



ఎస్పీ హరీష్

రాయగడ: రాయగడ జిల్లా నూతన ఎస్పీగా హరీష్ బిసిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఇంతవరకు విధులు నిర్వర్తించిన వివేకానంద శర్మను రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. నూతన ఎస్పీ హరీష్ కొరాపుట్ జిల్లా జైపూర్‌లో ఎస్డీపీవోగా పనిచేస్తూ పదోన్నతిపై రాయగడలో నియమితులయ్యారు.

జీవిత బీమా ఏజెంట్ల సంఘ వార్షికోత్సవం

రాయగడ: స్థానిక ఐసీఆర్ కళాశాల ప్రాంగణంలో జీవిత బీమా ఏజెంట్ల సంఘ వార్షికోత్సవం నిర్వహించారు. ఏజెంట్ల అధ్యక్షుడు డీపీ బాబు పట్నాయక్ (తవుడు) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీమా డెవలప్‌మెంట్ అధికారి గోవిందప్రసాద్ రథో మాట్లాడుతూ ఏజెంట్లు శాంతి, ఓర్పు, సహనంతో ఉన్న తంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో బీమా ఏజెంట్ల జాతీయ నాయకులు సుశాంత్ దేవ్, శాఖాధికారి ఖిరోద్‌మిశ్రా తదితరులు పాల్గొన్నారు.